క్లుప్తంగా

'స్పందన'కు 7 అర్జీలు

రేపల్లెరూరల్: ప్రజలు తమ సమస్యలను పరిష్కరించుకునేందుకు చక్కని వేదిక స్పందన కార్యక్రమమని ఆర్డీఓ హేలా షారోన్ అన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆమె ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వివిధ సమస్యలపై ఏడు అర్జీలు అందాయని తెలిపారు.భూమి ఆన్‌లైన్ చేయాలని ఉప్పూడి, నిజాంపపట్నంకు చెందిన వారు వేర్వేరుగా అర్జీని అందించారన్నారు. మరణ ధ్రువీకరణ పత్రానికి భట్టిప్రోలు వ్యక్తి విద్యుత్ పోల్స్‌పైన ఉన్న విద్యుత్ తీగలను సరిచేయాలని, రైతుభరోసా మంజూరు చేయాలని 5వ వార్డు నుంచి అర్జీలు అందాయన్నారు. 5వవార్డులో మురుగు కాల్వ పూడికతీత తీసి తమపొలంలో సిల్ట్‌ను వేస్తున్నారని, సిల్ట్‌ను తొలగించాలని పొలం యజమాని ఫిర్యాదు చేశారన్నారు. తమ పొలానికి చెందిన సర్వే రిపోర్ట్‌ను అందించాలని అరవపల్లికి చెందిన వారు అర్జీని అందించారన్నారు. సమస్యలను పరిశీలించి పరిష్కరించబడునన్నారు.

మున్సిపల్ కమిషనర్‌గా రామ బోపాల్‌రెడ్డి



రేపల్లె రూరల్: రేపల్లె మున్సిపల్ కమిషనర్‌గా టి.రామ బోపాల్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల సాధారణ బదిలీలలో భాగంగా హిందూపూర్ మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేస్తూ రేపల్లె విచ్చేశారు. రేపల్లె కమిషనర్‌గా పనిచేస్తున్న బి.విజయ సారథి చీరాల మున్సిపాలిటీకి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ బోపాల్‌రెడ్డి మాట్లాడుతూ పట్టణంలో పారిశుద్ధ్య మెరుగుదలకు కృషి చేయటంతో పాటు పాలకమండలి సభ్యుల సమన్వయంతో పట్టణాభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. ఈ సందర్భంగా మున్సిపల్ సిబ్బంది కమిషనర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

నేడు గొరిగపూడిలో 'జగనన్న ఆరోగ్య సురక్ష'

భట్టిప్రోలు: గొరిగపూడిలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీఓ గుమ్మా చంద్రశేఖరరావు సోమవారం తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే ఈ క్యాంప్‌లో రెండు పీహెచ్‌సీల నుంచి వైద్యులు, ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ హాస్పిటల్ నుంచి ఇద్దరు వైద్య నిపుణులు పాల్గొని, వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందిస్తారని తెలిపారు. ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ తిరువీధుల ఉదయభాస్కరి, సర్పంచ్ గరిగపాటి మల్లిక, ఎంపీటీసీ సభ్యురాలు వరికూటి పున్నయ్య, ప్రజా ప్రతినిధులు పాల్గొంటారని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భట్టిప్రోలు: భట్టిప్రోలు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఆ శాఖ ఏఈ పి.ఏడుకొండలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు వైఎస్సార్ ఆసరా నగదు చెక్కుల పంపిణీ

రేపల్లె రూరల్: పట్టణంలోని సీతారామ యోగిని కల్యాణ మండపంలో మంగళవారం ఉదయం 10 గంటలకు వైఎస్సార్ ఆసరా 4వ విడత నగదు చెక్కుల పంపిణీ జరుగుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్, బావుడా చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు పాల్గొంటారని పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులు, ప్రజలు పాల్గొనాలని పేర్కొన్నారు.

నగదు బహుమతి ఇవ్వండి

రేపల్లె రూరల్: ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీల విజేతలకు నగదు బహుమతిని అందజేయాలని నిజాంపట్నం మండలానికి చెందిన పలువురు క్రీడాకారులు పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయానికి సోమవారం చేరుకున్నారు. వాలీబాల్ బాలుర, బాలికల జట్లు, కబడ్డీలో మహిళా జట్టు నియోజకవర్గ స్థాయి విజేతలుగా నిలిచినట్లు క్రీడాకారులు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శివపార్వతీ క్రీడాకారులతో మాట్లాడారు. క్రీడాకారులు ముందుగానే ఆన్‌లైన్‌లోనే తమ వివరాలు నమోదు చేసుకున్నందున.. తమ బ్యాంక్ ఖాతాల్లో ప్రైజ్‌మనీ చేస్తామని, పూర్తి వివరాలకు బాపట్ల జిల్లా డీఎస్‌డీవో కార్యాలయంలో సంప్రదించాలని వారికి వివరించాడంతో అక్కడి నుంచి క్రీడాకారులు వెళ్లిపోయారు.

గుండె పోటుతో ఫీల్డ్ అసిస్టెంట్ మృతి



ఏట్రవారిపాలెం(కర్లపాలెం): ఏట్రవారిపాలేనికి చెందిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ పులుగు శ్రీనివాసరెడ్డి(45) గుండెపోటుతో సోమవారం మృతి చెందారు. వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే చీరాల గోవర్ధన్‌రెడ్డి, ఏపీఓ సుభాషిణి, సిబ్బంది మృత దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

ఇక జిల్లా స్థాయిలో సత్తా చాటుదాం..!



కప్ అందుకుంటున్న కొల్లూరు కబడ్డీ మహిళా జట్టు



కప్‌తో ఖోఖో విజేత చుండూరు మండల మహిళా జట్టు



కప్ అందుకుంటున్న ఖోఖో వేమూరు పురుషుల జట్టు

- ముగిసిన వేమూరు నియోజకవర్గ స్థాయి 'ఆడుదాం ఆంధ్రా' క్రీడలు
- హోరా హోరీగా సాగిన వాలీబాల్, ఖోఖో పోటీలు

కొల్లూరు: 'ఆడుదాం ఆంధ్రా' వేమూరు నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు సోమవారంతో ముగిశాయి. కొల్లూరు బాలుర ఉన్నత పాఠశాలలో వాలీబాల్, ఖోఖో పోటీల్లో పలు జట్లు హోరాహోరీగా పోరాడాయి. వాలీబాల్ పురుషుల విభాగంలో.. వేమూరు జట్టు విజయం సాధించింది. చుండూరు జట్టు ద్వితీయ స్థానం, తృతీయ స్థానంలో భట్టిప్రోలు నిలిచింది. మహిళల విభాగంలో భట్టిప్రోలు విన్నర్‌గా నిలిచింది. వేమూరు, కొల్లూరు జట్లు తర్వాతి స్థానాల్లో నిలిచాయి. ఖోఖో పురుషుల విభాగంలో అమృతలూరు జట్టు విజయకేతనం ఎగురవేయగా.. చుండూరు జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. మహిళల విభాగంలో చుండూరు ప్రథమ స్థానంలో నిలవగా, వేమూరు, కొల్లూరు జట్లు ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించాయి. అనంతరం వీరితో పాటు క్రికెట్, బ్యాడ్మింటన్, కబడ్డీ విజేతలకు కప్‌లు, మెడల్స్, ధ్రువ పత్రాలను వేమూరు ఎంపీపీ యల్లమాటి మోహన్, కొల్లూరు వైస్ ఎంపీపీ మురాల రాంబాబు, వేమూరు మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ బొల్లిముంత ఏడుకొండలు, వైఎస్సార్ సీపీ నాయకులు కమ్మెల సాంబశివరావు, గరిక రమేష్ పంపిణీ చేశారు. పాఠశాలల పీఈటీలు 28 మందితో పాటు, వైద్య సేవలు అందజేసిన వైద్య, ఆరోగ్య సిబ్బందికి, వేమూరు మండల పరిషత్తు సిబ్బందికి కొల్లూరు వైఎస్సార్ సీపీ పార్టీ ఆధ్వర్యంలో జ్ఞాపికలు అందజేసి, సన్మానించారు.



బ్యాడ్మింటన్ విజేత కొల్లూరు పురుషుల జట్టుకు కప్ అందజేత



కప్‌తో వాలీబాల్ వేమూరు పురుషుల జట్టు



కప్‌తో వాలీబాల్‌లో భట్టిప్రోలు మహిళల జట్టు

ప్రభుత్వ పాఠశాలల దశ మార్చిన సీఎం జగన్

సినీ రచయిత కోన వెంకట్

కర్లపాలెం: సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మన బడి నాడు–నేడు కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలల దశ మార్చి వేశారని ప్రముఖ సినీ రచయిత కోన వెంకట్ అన్నారు. సోమవారం వైఎస్సార్ సీపీ నాయకులతో కలసి ఆయన గణపవరం ప్రాథమిక, జెడ్పీ ఉన్నత పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా కోన వెంకట్ జగనన్న గోరుముద్ద మధ్యాహ్న భోజనం, తరగతి గదిలో బల్లలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో ఇంగ్లీష్‌లో మాట్లాడగా.. వారు కూడా ఆయనకు ఇంగ్లీష్‌లో సమాధానం చెప్పటంతో ఆనందం వ్యక్తం చేశారు. కోన వెంకట్ మాట్లాడుతూ ఎందరో ముఖ్యమంత్రులను చూశానని పేద ప్రజల పిల్లలు చదువుకునే ప్రభుత్వ పాఠశాలల గురించి ఎవరూ పట్టించుకోలేదన్నారు. సీఎం జగన్ మాత్రం చదువుకోవటం ద్వారా పేదరికాన్ని జయించవచ్చనే నినాదంతో ప్రభుత్వ పాఠశాలల్లో నాడు–నేడు కార్యక్రమాలతో మౌలిక వసతులు కల్పించటంతో.. పాటు విద్యార్థులకు పౌష్టికాహారం అందించటం, నాణ్యమైన బుక్స్, యూనీఫాం, షూ, స్కూల్ బ్యాగ్‌లు, డిక్షనరీలు, ట్యాబ్‌లు అందజేస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు, ఎంపీపీ యారం వనజ, ఏఎంసీ చైర్మన్ దొంతిబోయిన సీతారామిరెడ్డి, నాయకులు సాగర్, స్వామిరెడ్డి, శ్యామ్యూల్ జాన్ నాగార్జునరెడ్డి, రవి పాల్గొన్నారు.



గణపవరం ప్రాథమిక పాఠశాలను సందర్శించిన సినీ రచయిత కోన వెంకట్, ఏఎంసీ చైర్మన్

దుప్పట్ల పంపిణీ

కర్లపాలెం: ప్రముఖ సినీ రచయిత కోన వెంకట్ చింతాయపాలెం, గణపవరం, పాతనందాయపాలెం గ్రామాల్లో వైఎస్సార్ పెన్షన్ లబ్ధిదారులకు కోన చారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక సహకారంతో సోమవారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు, ఎంపీపీ యారం వనజ, ఏఎంసీ చైర్మన్ దొంతిబోయిన సీతారామిరెడ్డి, సర్పంచ్‌లు దేవరకొండ అంకమ్మ, కావూరి చిట్టెమ్మ, అక్కల శ్రీనివాసరెడ్డి, పార్టీ నాయకులు ఉన్నారు.

ప్రార్థన మందిరం ప్రారంభం



విద్యా సామగ్రి అందజేస్తున్న బెంజిమెన్, చల్లా రామయ్య, రాఘవరెడ్డి

బాపట్ల అర్బన్: వెదుళ్ళపల్లి పంచాయతీలోని రామయ్య దివ్యాంగుల కాలనీలో నూతనంగా క్రీస్తు సంఘం చర్చిని సోమవారం జొన్నలగడ్డ బెంజిమెన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా బాపట్ల జిల్లా వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు చల్లారామయ్య పాల్గొన్నారు. ప్రారంభోత్సవంలో పాల్గొన్న చిన్నారులకు పుస్తకాలు, పెన్నులు, పలకలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి, జీసీఎస్ కన్వీనర్ ముద్ది ముక్కల డేవిడ్, బాపట్ల మార్కెట్ అధ్యక్షుడు గవిని కృష్ణమూర్తి, వెదులపల్లి ఎంపీటీసీ కుంచాల శ్రావణి, క్రీస్తు సంఘం చర్చి సంఘ కాపరి కే.రవికుమార్, దైవజనులు సంఘ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

కర్లపాలెంలో అన్నదానం

కర్లపాలెం: దివంగత నేత వైఎస్సార్ అభిమాని కొక్కిగడ్డ రామరాజు ఆహార్ ధాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం కర్లపాలెం కూరగాయల మార్కెట్ వద్ద వైఎస్సార్ ప్రసాదం పేరుతో అన్నదానం చేశారు. వైఎస్సార్ సీపీ నాయకుడు తాతపూడి మనోహర్ అన్నదానాన్ని ప్రారంభించారు. 23 వారాలుగా అన్నదానం చేస్తున్నట్లు రామరాజు ఈ సందర్భంగా తెలిపారు.

అక్రమంగా మద్యం తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

లక్ష్మీపురం: అక్రమంగా మద్యం సీసాల్ని రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తుల్ని అరెస్టు చేసిన ఘటన సోమవారం గుంటూరు రైల్వే స్టేషన్‌లో చోటు చేసుకుంది. రైల్వే జీఆర్పీ ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. రైల్వే ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్ ఆదేశాల మేరకు జీఆర్పీ సీఐ గంగా వెంకటేశ్వర్లు సమక్షంలో గుంటూరు రైల్వే స్టేషన్‌లో సోమవారం తనిఖీలు నిర్వహించారు. గుంటూరు జిల్లా తాడికొండ మండలం పొన్నెకల్లు గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తుల బ్యాగ్‌లో మద్యం సీసాలు దొరికాయి. ఇద్దరినీ అదుపులోకి తీసుకుని జీఆర్పీ స్టేషన్‌కు తరలించి విచారించారు. పాండిచ్చేరి రాష్ట్రం యానాం నుంచి గుంటూరుకు అక్రమంగా మద్యం సరఫరా చేస్తున్నట్లు తెలిసింది. ఇద్దరి నుంచి ఐదు మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ రైళ్లలో అక్రమంగా మద్యం, గంజాయి వంటి మాదకద్రవ్యాలను సరఫరా చేస్తున్నట్లు ప్రయాణికులకు అనుమానం కలిగిన తక్షణమే రైల్వే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.



వివరాలు వెల్లడిస్తున్న జీఆర్పీ ఎస్ఐ రమేష్

ఈవీఎంలపై సందేహాలను నివృత్తి చేసుకోండి

ప్రత్తిపాడు: ఈవీఎంలపై ఓటర్లు తమ సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని తహసీల్దార్ జి.సిద్దార్థ తెలిపారు. మండల పరిధిలోని నడింపాలెం, రావిపాటివారిపాలెం గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో సోమవారం ఈవీఎంల పనితీరుపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈవీఎం పనితీరు, ఓటు వేసే విధానం, వేసిన తరువాత వీవీప్యాట్‌ల్లోనికి స్లిప్ వచ్చే విధానం.. వంటి పలు అంశాలపై ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఎప్పటిలానే రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఈవీఎంల ద్వారానే ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని తెలిపారు. ఈవీఎంల వినియోగంపై కొందరికి సందేహాలు, అనుమానాలు ఉన్నాయని, అలాంటి వాటిని తొలగించేందుకే ఎన్నికల కమిషన్ ఈవీఎంలపై అవగాహన కల్పిస్తుందన్నారు. నిన్నటి వరకు తహసీల్దార్ కార్యాలయాల్లో జరిగిన అవగాహన క్యాంప్, నేటి నుంచి గ్రామాల్లో కూడా కొనసాగనుందని తహసీల్దార్ తెలిపారు.



ఈవీఎం పనితీరుపై అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ సిద్దార్థ

అప్రమత్తతతో రహదారి ప్రమాదాలు దూరం

పెదకాకాని: వాహనాలు నడిపే సమయంలో డ్రైవర్లు ప్రతి నిమిషం అప్రమత్తంగా ఉండాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ టి రాఘవరావు అన్నారు. పెదకాకాని మండలం నంబూరు వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల నందు సోమవారం జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా కళాశాల బస్సు డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మోటార్ వెహికల్ అధికారి రాఘవరావు మాట్లాడుతూ డ్రైవర్లు రోడ్లపై వాహనాలు నడిపే సమయంలో అప్రమత్తంగా ఉండాలని అన్నారు. రోడ్డుకు ఎడమవైపు మాత్రమే వాహనాలు నిలపాలని సూచించారు. యాజమాన్యాలు డ్రైవర్లకు ప్రతి మూడు నెలలకు ఒకసారి వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. రోడ్ల పైకి వచ్చే వాహనాలకు తప్పనిసరిగా ధ్రువీకరణ పత్రాలు ఉండాలన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ రోడ్డు భద్రత మనందరి బాధ్యత అన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాలు మనందరి మంచి కోరి రవాణా శాఖ నిర్వహిస్తుందన్నారు. రవాణా శాఖ అధికారులు అందించే సూచనలు డ్రైవర్లు తప్పనిసరిగా పాటించాలన్నారు. అనంతరం డ్రైవర్లచే రోడ్డు నియమాలు పాటిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్‌లు కె మల్లీశ్వరి, జి సౌజన్య, కళాశాల ట్రాన్స్‌పోర్ట్ కన్వీనర్ పీవీ సురేంద్రమోహన్ కుమార్, ఎం లక్ష్మీ వినీత, విద్యార్థులు, రవాణా సిబ్బంది పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న రవాణశాఖ అధికారి రాఘవరావు తదితరులు

రహదారి ప్రమాదంలో దంపతులకు గాయాలు

చేబ్రోలు: చేబ్రోలు మండలం వేజండ్ల అడ్డ రోడ్డు సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలయ్యాయి. తెనాలి నుంచి గుంటూరుకు ద్విచక్రవాహనంపై వెళ్తున్న దంపతులను వడ్లమూడిలో జరిగిన టీడీపీ సభకు వెళ్తున్న యువకులు ద్విచక్రవాహనంతో అతివేగంతో ఢీ కొట్టడంతో వారికి తీవ్ర గాయాలయ్యాయి. తెనాలికి చెందిన దంపతులు టి.రత్నకుమారి, వెంకటేశ్వర్లులకు గాయాలయ్యాయి. రత్నకుమారి తలకు బలమైన గాయమైంది. ఇరువురిని 108 వాహనం ద్వారా గుంటూరు వైద్యశాలకు తరలించారు.

వ్యక్తిపై దాడి

గుంటూరు ఈస్ట్: పాత కక్షల నేపథ్యంలో ఇద్దరు యువకులు వ్యక్తిపై దాడి చేసిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. కోబాల్ట్ పేట ఐదో లైనులో షేక్ మస్తాన్‌వలిపై హర్షవర్ధన్, అతని స్నేహితుడు పాత కక్షల నేపథ్యంలో సోమవారం దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాఫిక్ పోలీసులకు మైక్ సెట్ వితరణ



మైక్ సెట్ అందిస్తున్న డాక్టర్ రాయపాటి మమత, సిబ్బంది

గుంటూరు మెడికల్: గుంటూరు రమేష్ హాస్పిటల్ యాజమాన్యం సోమవారం వెస్ట్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు మైక్ సెట్‌ను వితరణగా అందజేసింది. స్టేషన్ పరిధిలోని ఎంటీబీ సెంటర్‌లో ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉన్నందున ఎనౌన్స్‌మెంట్ చేసేందుకు మైక్ సెట్ కావాలని పోలీసులు సంప్రదించారు. రమేష్ హాస్పిటల్ యాజమాన్యం స్పందించి వెస్ట్ ట్రాఫిక్ పోలీసు అవసరాన్ని గుర్తించి సెట్‌ను అందజేసింది. ఈ సందర్భంగా హాస్పటల్ యాజమాన్యం డాక్టర్ రాయపాటి మమత, సిబ్బందికి వెస్ట్ ట్రాఫిక్ పోలీసులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యం

వైఎస్సార్ సీపీ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు

కొల్లూరు: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమివ్వడంతో పాటు, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు వేమూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు అన్నారు. సోమవారం అమృతలూరు మండలంలోని గోవాడలో స్థానిక నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. సమస్యలను తెలుసుకునేందుకు కాఫీ విత్ మై లీడర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగ గ్రామంలో పర్యటించి, ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. స్థానిక ప్రముఖ గోవాడ ఆలయంలో కుటుంబ సభ్యులతో కలసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు.



గోవాడ ఆలయంలో ప్రత్యేక పూజలో పాల్గొన్న సమన్వయకర్త అశోక్‌బాబు దంపతులు

తగ్గించిన అడిషనల్ క్వాంటంను పునరుద్ధరించాలి

స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు

బాపట్ల అర్బన్: తగ్గించిన అడిషనల్ క్వాంటం పునరుద్ధరించాలి, డీఏ బకాయిలను విడుదల చేయాలంటూ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ బాపట్ల శాఖ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. జిల్లా శాఖ అధ్యక్షుడు చెరుకూరి సుబ్బారావు మాట్లాడుతూ తమ డిమాండ్ల పట్ల ప్రభుత్వం ఉదాసీనత ప్రకటిస్తుందన్నారు. జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎంసీ హెచ్.రాజరత్నం మాట్లాడుతూ 10వ పీఆర్సీ కమిషనర్ 70 సంవత్సరాలు నిండిన వారికి 15 శాతం అడిషనల్ క్వాంటం సిఫార్సు చేస్తే గత ప్రభుత్వం 10 శాతం మంజూరు చేసిందన్నారు. జిల్లా శాఖ ఉపాధ్యక్షుడు షేక్ జిలాని మాట్లాడుతూ ప్రభుత్వం క్యాష్ లెస్ సదుపాయం కల్పిస్తూ ఈహెచ్ఎస్ కార్డులు మంజూరు చేసినప్పటికీ ఆచరణలో నెట్‌వర్క్ ఆసుపత్రులు, ఉద్యోగులు, పెన్షనర్లకు వైద్యం అందించడం లేదన్నారు. ధర్నాలో బాపట్ల జిల్లా శాఖ కార్యదర్శి ఏవీ భవాని శంకర్, ట్రెజరర్ ప్రసాద్, సంయుక్త కార్యదర్శి జి.సూర్యనారాయణ, కర్లపాలెం కార్యదర్శి రమేష్, వల్లయ్య, చెరుకుపల్లి కార్యదర్శి శ్రీరామమూర్తి, అధ్యక్షులు ఆంజనేయులు, నాగమల్లేశ్వరరావు, పీవీ పాలెం అధ్యక్షుడు ఎం. గూడేరా పాల్గొన్నారు. ధర్నా అనంతరం జిల్లా కలెక్టర్‌కి వినతిపత్రం అందజేశారు.

జీవన ఎరువులతో నాణ్యమైన దిగుబడులు

పిట్టలవానిపాలెం: జీవన ఎరువుల వినియోగించడం వల్ల తక్కువ ఖర్చుతో నాణ్యమైన అధిక దిగుబడులు పొందవచ్చని కదిరి వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ త్రిమూర్తి తెలిపారు. కదిరి బాబురావు వ్యవసాయ కళాశాల ఫైనల్ ఇయర్ విద్యార్థులు సోమవారం పిట్టలవానిపాలెం సచివాలయంలో రైతు సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు జీవ సేంద్రియ ఎరువులను వినియోగించడం వల్ల ఆరోగ్యకరమైన ఉత్పత్తులను పండించవచ్చన్నారు. రావెప్ కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ కళాశాల విద్యార్థులు గత మూడు నెలలుగా గ్రామంలో రైతులతో మమేకమవుతూ శిక్షణ పొందుతున్నారన్నారు. పలు రకాల స్టాల్స్‌ను ఏర్పాటు చేసి, రైతులకు విద్యార్థులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



రైతు సదస్సును ప్రారంభిస్తున్న అసోసియేట్ డీన్ త్రిమూర్తి

చంద్రబాబుది చౌకబారు చరిత్ర

విద్యార్థులతో ముఖాముఖీలో వైఎస్సార్ సీపీ నేతలు

పట్నంబజారు: ఒక్క ప్రజా ఉపయోగకరమైన పథకం కూడా తీసుకురాలేని చౌకబారు చరిత్ర చంద్రబాబుకి మాత్రమే సొంతమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, గుంటూరు క్లస్టర్ – 2 పార్టీ అధ్యక్షుడు నూనె ఉమామహేశ్వరరెడ్డి విమర్శించారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా జాతీయ బీసీ సంఘం రాష్ట్ర యువజన అధ్యక్షులు గూడూరు నాని ఆధ్వర్యంలో స్థానిక ఎన్జీవో కాలనీలో బీసీ విద్యార్థులతో సోమవారం వైఎస్సార్ సీపీ నేతల ముఖాముఖీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నూనె ఉమామహేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఏ పథకమైనా అన్ని వర్గాలకు ప్రయోజనం చేకూర్చినప్పుడే అది ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతుందని తెలిపారు. ఎన్నో సంక్షేమ పథకాల్ని ప్రవేశపెట్టి ప్రజల గుండెల్లో దివంగత మహానేత డాక్టర్ వైఎస్. రాజశేఖరరెడ్డి, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారని చెప్పారు. సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలు జనరంజకం కనుకనే విద్యార్థుల నోళ్లలోనూ నిత్యం నానుతూ ఉన్నాయని స్పష్టం చేశారు. చంద్రబాబు స్వప్రయోజనాల కోసం తప్పితే ప్రజల మేలు కోరి కనీసం ఒక్క పథకం కూడా ప్రవేశపెట్టిన పాపాన పోలేదని ఆరోపించారు. 2024లో జరగనున్న ఎన్నికల యుద్ధం ఎప్పుడు వచ్చినా... సీఎం వైఎస్. జగన్‌మోహన్ పక్షాన పోరాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి పథంలో నడుపుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, పేదలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఓ వైపు ఉంటే.. ప్రజల్ని నిత్యం మోసం చేస్తూ 14 సంవత్సరాలు పరిపాలించినా కనీసం ఒక్క పథకం కూడా ప్రవేశపెట్టానన్న చెప్పుకోలేనిస్థితిలో ఉన్న చంద్రబాబు మరోవైపు ఉన్నారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో మరోమారు జగనన్న తిరిగి సీఎంను చేసుకుంటామని ప్రజలు ముక్తకంఠంతో చెబుతున్నారని పేర్కొన్నారు. కార్పొరేటర్ షేక్ రోషన్, పార్టీ నేతలు మల్లికార్జున యాదవ్, అరుణ పాల్గొన్నారు.



విద్యార్థులతో ముఖాముఖీ కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నేతలు

నైపుణ్యాలతో పరిశ్రమలకు అనుసంధానం కావాలి



ప్రొఫెసర్ దేసు రామమోహనరావు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులు నైపుణ్యాల్ని పెంపొందించుకుని పరిశ్రమలకు అనుసంధానం కావాలని మంగళగిరిలోని ఎయిమ్స్ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ డీన్ ప్రొఫెసర్ దేసు రామమోహనరావు పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాలలో సోమవారం ఏర్పాటు చేసిన స్ఫూర్తి–ది ఐక్యూబ్ ఎక్స్‌పోను ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నూతన ఆవిష్కరణల దిశగా విద్యార్థుల్ని ప్రోత్సహించడంలో ఎక్స్‌పోలు దోహదం చేస్తాయని తెలిపారు. విద్యార్థులు తమ ఆవిష్కరణల్ని మార్కెట్‌కు పరియచం చేయడంతో పాటు పరిశ్రమల ప్రతినిధులతో మమేకం కావడం ద్వారా జ్ఞాన సముపార్జన, నైపుణ్యాభివృద్ధికి ఉపయోగపడుతుందని చెప్పారు. హాస్పిటల్ మేనేజ్‌మెంట్ కోర్సుతో వచ్చే ఉద్యోగావకాశాల్ని వివరించారు. ఐటీసీ సీనియర్ హెచ్ఆర్ మేనేజర్ రామచందర్ మాట్లాడుతూ భావి పారిశ్రామికవేత్తలుగా రాణించడంలో విద్యార్థులకు ఎక్స్‌పోలు దోహదం చేస్తాయని తెలిపారు. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా స్టార్టప్‌లను స్థాపించి, ఉద్యోగావకాశాలను కల్పించడంతో పాటు దేశ ఆర్థికావృద్ధికి దోహదపడాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ మాట్లాడుతూ విద్యార్థుల్ని పరిశ్రమల అవసరాలకు దీటుగా తయారు చేసేందుకు విద్యాసంస్థలు, పరిశ్రమల అనుసంధానమే మార్గమని తెలిపారు. వివిధ పారిశ్రామిక, ఆస్పత్రుల ప్రతినిధులతో పాటు స్ఫూర్తి కన్వీనర్ డాక్టర్ వి. చక్రవర్తి, కో–కన్వీనర్ డి. కళ్యాణి, సహాయాచార్యులు సీహెచ్. వైష్ణవి, సీహెచ్ వేదవతి, వి.బాజీబాబు, వి.అభిలాష్, డాక్టర్ గోపి శ్రీనివాసరావు, ఎస్. మణికంఠ, బి. అనిత పాల్గొన్నారు.

అకౌంట్ నుంచి నగదు మాయం చేసిన వ్యక్తిపై కేసు

గుంటూరు ఈస్ట్: వృద్ధురాలి కేర్ టేకర్‌గా ఉన్న వ్యక్తి ఆమె అకౌంట్‌లో నగదు డ్రా చేసిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. రామన్నపేట 1/5లో భీమినేని అనురాధ తల్లి ఒంటరిగా నివసిస్తోంది. ఆమెకు పి.సాంబశివరావు కేర్ టేకర్‌గా ఉన్నాడు. అతడు వృద్ధురాలి సెల్‌ఫోన్ పేటీఎం నుంచి పలుమార్లు తన అకౌంట్‌లోకి రూ. 9 లక్షలు ట్రాన్స్‌ఫర్ చేసుకున్నాడు. ఆలస్యంగా గుర్తించిన అనురాధ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.